క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని ధుమంతునిగూడెం, సుబ్బరాయపురం, కొత్తగూడెం గ్రామాలకు ఆది, సోమవారాలు విద్యుత్ సరఫరాను నిలుపు చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామన్నపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీఎస్ పనుల నిమిత్తం రెండు రోజులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరం కలుగుతుందని ఆయన చెప్పారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాలాజీ సుందరరావు

నిడదవోలు రూరల్: సోషల్ మీడియా మాధ్యమాల్లో వచ్చే వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడాలని ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం సైబర్ క్రైమ్ పోక్సో చట్టాలు, శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో, కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. ఆత్మరక్షణకు బాలికలు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై జి.కల్పన, పాఠశాల హెచ్ఎం కె.జిలానీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శిక్షణకు వచ్చిన ట్రైనీ ఎస్సై



ట్రైనీ ఎస్సై శ్రీనివాస్

తాళ్లపూడి: ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని నూతనంగా ఉద్యోగంలో చేరిన ట్రైనీ ఎస్సై చింతలపూడి ఆదిత్య శ్రీనివాస్ తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కు శనివారం క్షేత్రస్థాయి నిమిత్తం మండలానికి వచ్చారు. ప్రొహిబిషన్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించడానికి ముందుగా స్టేషన్‌లో విధుల నిర్వహణ, రికార్డులు వంటి వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడకి వచ్చానని, స్వగ్రామం అవనిగడ్డ అని వివరించారు. శిక్షణలో భాగంగా 20 రోజులు ఇక్కడ ఉంటానన్నారు.

దివ్యాంగునికి వీల్‌చైర్ బహూకరణ



దివ్యాంగునికి వీల్ చైర్ అందజేస్తున్న సంస్థ సభ్యులు

తాళ్లపూడి: పుట్టుకతోనే పోలియోతో బాధపడుతున్న బల్లిపాడు గ్రామానికి చెందిన కొడమంచిలి కార్తీక్ (12)కు దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో తాళ్లపూడికి చెందిన డాక్టర్ మూర్తి ఆర్థిక సాయంతో శనివారం వీల్ చైర్‌ని అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ దివ్యాంగులకు కావలసిన కృత్రిమ అవయవాలు కావలసినవారు 93910 89381 నంబర్ సంప్రదిస్తే ఉచితంగా అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు నాగరాజు, అనపర్తి రాజు, ప్రభాస్ పాల్గొన్నారు.

సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లపూడి: రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడిగా అనపర్తి ప్రసాద్, ఇతర నూతన కమిటీ సభ్యులు శనివారం పదవీ ప్రమాణ స్వీకారం శనివారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నష్టాల బాటలో ఉన్న సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. సొసైటీ నిధుల దుర్వినియోగంపై పలు ఆరోపణలు వచ్చాయని, దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సొసైటీ సెక్రటరీ కె.భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన

నిడదవోలు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులకు రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ పి.జాన్సన్ అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు, మార్గదర్శకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం అరుణ ఫిలిప్, నిడదవోలు వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు పల్లపరాజు, కార్యదర్శి బండి ప్రదీప్, సిహెచ్ సతీష్ కుమార్, పాలేటి శ్రీను, సుందర్ జేమ్స్, నీలం సత్యనారాయణ, వలవల శాంతి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

చదువులమ్మ ఒడి

- కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- బాల్యారంభ సంరక్షణ - విద్యకు ప్రాధాన్యం
- సృజనాత్మక బోధన, అభ్యసనపై ప్రత్యేక దృష్టి



అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో చిన్నారులు

నల్లజర్ల: పిల్లల జీవితంలో తొలి ఐదేళ్లు కీలకం.ఈ దశలో వేసే పునాదులే వారి భవిష్యత్తుకు బంగారు బాటగా నిలుస్తుంది. చిన్నారుల భవితే లక్ష్యంగా శిశుసంక్షేమ శాఖ చర్యలు చేపట్టిన జాతీయ విద్యా విధానం - 2020,బాల్యారంభ సంరక్షణ-విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. నవచేతన-బాల్యారంభప్రేరణ జాతీయ చట్టాన్ని రూపొందించింది. దీనిలో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఓక్రమ పద్ధతిలో బోధన, అభ్యసనకు దృష్టి సారించింది. బాల్యం నుంచే అమ్మ బాషలో నాణ్యమైన బోధన అందిస్తూ పిల్లలకు చక్కగా అర్ధమయ్యే రీతిలో పాఠాలు రూపొందించిన రెండు కొత్త పుస్తకాలును ఈ ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిలో పిల్లలతో పాటు తల్లులకు ఉపయోగపడే అంశాలు పొందుపర్చి కొత్త వరవడికి శ్రీకారం చుట్టారు.

పెరిగిన ప్రాధాన్యం

గోపాలపురం సీడీపీఓ ప్రాజెక్టు పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 13 మినీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 5,735 మంది ఉండగా, 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు చిన్నారులు 6,516 మంది ఉన్నారు. ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలను పాత ఇండ్లు, కిరాయి గదుల్లో నిర్వహించేవారు. అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో చాలా వరకు పేరుకే సెంటర్లుగా ఉండేవి. నిధులు లేక అరకొర వసతులతో అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించేవారు. అక్కడి పరిస్థితులను



నవచేతన,ఆధార్‌శిల నూతన పుస్తకాలు

చూసి పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి కనబర్చేవారు కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి బాట పట్టించారు. దీంతో ప్రస్తుతం రంగురంగుల అందమైన చిత్రాలు, ఆకట్టుకునే ఆట బొమ్మలతో కేంద్రాలు ప్లేస్కూళ్లను తలపిస్తున్నాయి. చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ఆటాపాటలతో చదువు కూడా అందుతుంది. ప్రైవేటు, కార్పొరేట్ ప్లే స్కూళ్లలో నర్సరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలన్నీ గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చింది. దీంతో చిన్నారులు ఆడుతూపాడుతూ చదువుకుంటున్నారు.

నవచేతనలో..

నవచేతన పుస్తకంలో గర్భస్థ శిశువు గర్భధారణ దశ నుంచే శారీరక, మానసిక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ పుస్తకం దోహదపడుతుంది. నేను నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం-రుచులు వంటి పాఠ్యాంశాలుగా ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మూడేళ్ల లోపు చిన్నారులకు వీటిని బోధించడంతో పాటు తల్లిదండ్రలకు వివరించాలి. వారు ఇంటివద్ద అనుసరించాలి. చిన్నారులలో విషయ పరిజ్ఞానం పెంపొందించేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలనేది



చిన్నారుల విద్యను పరిశీలిస్తున్న సీడీపీఓ

వీటిలో బొమ్మలతో సహా ముద్రించారు.

ఆధార్‌శిలలో..

అంగన్‌వాడీలకు ఆరు ఏళ్ల లోపు పిల్లలు ఎక్కువగా వస్తారు. దీంతో పాఠాలు వినోదాత్మకంగా ఏవిధంగా బోధించాలనే అంశాలను ఈ ఆధార్‌శిల పుస్తకంలో రూపొందించారు. ఇతివృత్తాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు సహాయపడేలా రూపొందించారు. నా కుటుంబం, రుతువులు, పండుగలు వంటి ద్వారా పిల్లలు స్థానిక పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి ఇవి దోహదపడతాయి.

అన్ని కేంద్రాలకు అందించాం

అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నవచేతన,ఆధార్‌శిల పుస్తకాలు అందించాం. వీటి ద్వారా పిల్లల భవిష్యత్తు సమగ్రాభివృద్ధి చెందుతుంది.

దార.మమ్మీ, ప్రాజెక్ట్ అధికారిణి. గోపాలపురం

సృజనాత్మకంగా చిన్నారులకు బోధన



మూడేళ్లలోపు చిన్నారులను ప్రీ ప్రైమరీ-1, మూడేళ్లు దాటిన వారికి ప్రీ ప్రైమరీ-2గా విభజించి బోధిస్తున్నాం. కార్పొరేట్‌కు దీటుగా వారి వయస్సుకు తగ్గటుగా సులువైన బోధన చేపడుతున్నాం.

– అరుణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త. పోతవరం

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



వేళ్లచింతలగూడెంలో బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు అందజేస్తున్న వనిత, నాయకులు

గోపాలపురం: వేళ్లచింతలగూడెం ఎస్సీ ఏరియాలో ప్రకృతి సృష్టించినబీభత్సానికి నిలువ నీడలేకుండా పోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత డిమాండ్ చేశారు. శనివారం వేళ్ల చింతలగూడెంలో సుడిగాలులకు నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆమె కోరారు. ఇంటి పైకప్పులు పూర్తిగా నష్టపోయిన బాధితులకు ఆమె టార్పాలిన్లు అందజేశారు. ఆమె వెంట నాయకులు పిన్నమనేని వెంకటరత్నం, సర్పంచ్ గొల్ల కుమార్, కూసం రామమోహన్‌రెడ్డి, సాలి వేణు, కాకులపాటి శ్రీను, ముల్లంగి శ్రీనివాస రెడ్డి ఉన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత

రూ.50 లక్షల ఆస్తి నష్టం

గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామం ఎస్సీ కాలనీలో శుక్రవారం వీచిన ఈదురు గాలుల తీవ్రతకు దెబ్బతిన్న ఇళ్లను కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత పరిశీలించారు. ఈ మేరకు శనివారం ఆమె అధికారులతో కలిసి కాలనీలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. సుమారు 8 గృహాలు పూర్తిగా నష్టం వాటిల్లిందని, మరో 20 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. ఆస్తినష్టం రూ.50 లక్షల ఉంటుందని, బాధితుల పేర్లను నమోదు చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఆర్డీవో తెలిపారు. సుడిగాలి తీవ్రతకు 20 చెట్లు నేలకొరిగాయని, ఏడు విద్యుత్ స్తంభాలు విరిగిపడినట్లు ఆమె వివరించారు. విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించాలని, నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను స్థానిక కమ్యూనిటీ భవనంలో వసతి ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కె అజయ్‌బాబు, అధికారులను ఆదేశించారు.

విశేష అలంకరణలో వేంకటేశుడు



స్వామి, అమ్మవార్లు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరుని ఆలయానికి శ్రావణ మాసం మొదటి శనివారం వేలాదిమంది భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం చేసి అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తెల్లవారుజాము నుంచే వందలాది మంది భక్తులు రావటంతో రద్దీ పెరిగి స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ అభివృద్ధి కమిటీ భక్తులకు ఏర్పాట్లు చేసింది. దాతల సహకారంతో 6,500 మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉచిత అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారికి పుష్పాలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానం వంటి కార్యక్రమాలకు భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామని తెలిపారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

పెరవలి: అపర భగీరథుడు ఉభయ గోదావరి జిల్లాలకు అన్నపూర్ణగా ఖ్యాతినిచ్చిన ఘనుడు సర్ ఆర్థర్ కాటన్ అందరి హృదయాల్లో ఉన్నారని ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలోని నడుపల్లిలో కాటన్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరించారు. నేడు గోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే అందుకు ఆ మహానుభావుడు కట్టిన ఆనకట్ట చలవేనని ఇటువంటి మహానీయుని చరిత్ర ప్రతి ఒక్కరికి తెలియాలన్నారు. బూరుగుపల్లి శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ భీరా సత్యవేణి రాజు, విగ్రహ దాత సత్తిపండు గ్రామస్తులు పాల్గొన్నారు.



నడుపల్లిలో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున బూరుగుపల్లి శేషారావు

బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ

గోపాలపురం: గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెంలో సుడిగాలుల ప్రభావంతో దెబ్బతిన్న 30 కుటుంబాలకు మండల మానవత సభ్యులు శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సుమారు 300 మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయం అందజేస్తామని మండల మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, మాజీ అధ్యక్షుడు సత్యకృష్ణారెడ్డి, కీర్తికుమార్, నెల్లి చంద్రశేఖర్, ముప్పన కృపా వరప్రసాద్‌రెడ్డి, సీఆర్‌పీ కొయ్య నాగరాజు మండల మానవత సభ్యులు పాల్గొన్నారు.

శాంతి రథం కొనుగోలుకు రూ.8 లక్షల విరాళం

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖకు శాంతి రథం ఏర్పాటుకు దుద్దుకూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి కరుటూరి ధనుంజయ ముందుకు వచ్చినట్టు సంస్థ ప్రతినిధులు పప్పు వెంకటరామారావు, బండి సూర్యప్రకాశరావు, బళ్ల సూర్యచక్రం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్థివ దేహాల దహన కార్యక్రమాలకు కొవ్వూరు, రాజమహేంద్రవరం తీసుకు వెళ్లవలసి వస్తోందని, రథాలు అందుబాటులో లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రతినిధులు వివరించగా స్పందించిన ఆయన శాంతి రథం కొనుగోలుకు రూ.8 లక్షల విరాళం ఇవ్వడానికి అంగీకరించినట్టు ప్రతినిధులు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఓటీపీ తలనొప్పి

- మొరాయిస్తున్న సర్వర్లు
- నాణ్యత లేని స్టూడెంట్ కిట్లు

నల్లజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రస్తుత విద్యాసంవత్సరంలో పంపిణీ చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర (స్టూడెంట్ కిట్లు) పంపిణీలో తల్లిదండ్రుల నుంచి మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీ సమాచారం సేకరించడం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. మండలంలో ప్రస్తుతానికి 4,630 కిట్లు రాగా 4,580 పంపిణీ పూర్తి చేశారు. కాని వీటిలో ఇంకా ఓటీపీలకు సంబంధించి 780 పెండింగ్‌లో ఉన్నట్టు ఎంఇఓ-2 భగవతి పేర్కొన్నారు. ప్రతి స్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర యాప్‌ను ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నారు. యాప్‌లో వివరాలన్నీ నమోదు చేసి ఓటీపీ సబ్‌మిట్ చేయడానికి ఒక్కో విద్యార్థికి 10 నుంచి 15నిమిషాల సమయం పడుతోందని, పలువురు తల్లిదండ్రులు తమ మొబైల్‌కు వచ్చే ఓటీపీ చెప్పడానికి నిరాకరిస్తుండడంతో మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించడంతో సోమవారం నుంచి ఓటీపీతో పాటు బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఎంఈఓ వెల్లడించారు. షూస్‌లో కొలతలు తేడాలు వచ్చాయని వాటిని కూడ మార్పు చేయనున్నట్టు చెప్పారు.

యుద్ధ వీరుల త్యాగాలు యువతకు స్ఫూర్తి



సత్కారం అందుకున్న కార్గిల్ యుద్ధ వీరులు



సైనికుల వేషధారణలో విద్యార్థులు

నిడదవోలు: కార్గిల్ యుద్ధంలో విజయోత్సవాన్ని పురస్కరించుకుని మిలటరీ మాధవరం గ్రామంలో స్థానిక ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ హాలులో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం 12 మంది కార్గిల్ యుద్ధ వీరులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్‌కు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్ రూ. 5 వేలు, ఎక్స్ సర్వీస్ మెన్ పోలదాసు శ్రీనివాసరావులు రూ.5 వేలు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.12 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ గుంటిపల్లి శ్రీనివాసరావు, దారపురెడ్డి ప్రతాప్, సానేపు సుబ్బారావు, గుంటిపల్లి శివ, గరగా శ్రీనివాసరావు, కోటిపల్లి సత్యనారాయణ, చేబోలు వెంకటేశ్వరరావు, వి.నారాయణ, ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లం వీరయ్య, లక్కాకుల నాగేశ్వరరావు, గోపిశెట్టి భరతుడు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, నారపురెడ్డి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు నివాళి

తాళ్లపూడి: దేశ రక్షణలో సైనికులు అహర్నిశలు శ్రమిస్తున్నారని అక్షర సిద్ధి స్కూల్ కరస్పాండెంట్ సనపల సత్యకళ అన్నారు. తాళ్లపూడిలోని పాఠశాలలో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైనిక దుస్తులు ధరించి యుద్ధ విన్యాసాలను ప్రదర్శించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులకు దేశ భక్తిని కలిగించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అడ్డాల డేవిడ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నివేదికల ఆధారంగా ఎరువులు వాడాలి

దేవరపల్లి: యర్నగూడెంలోని వేణుగోపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వద్ద శనివారం జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ రైతులు, సొసైటీ సభ్యులకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎరువుల అధిక వినియోగంతో మట్టిలో పోషకాల సమతుల్యత నాశనం అవుతాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయంతో నేల జీవశక్తి పెరిగి రసాయన ఎరువులపై ఆధారపడే అవసరం తగ్గుతుందన్నారు. జీవామృతం, పంచగవ్య, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను యాంత్రిక ఎరువులతో కలిపి వాడితే నేల ఫలదాయకత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో సొసైటీ సీఈఓ మండా పెదబాబు, ప్రత్యేక అధికారి ఉషారాణి, కె. సుబ్బారావు, రైతులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి

నిడదవోలు: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేయార్డ్ వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని యాచకుడు (60) మృతిచెందాడు. జీఆర్‌పీ హెచ్‌సీ డి.శ్రీనివాసరావు ఘటనపై విచారణ చేపట్టి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 99480 10061 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బైక్‌ను ఢీకొన్న 108 వాహనం

నల్లజర్ల: క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే 108 వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బుట్టాయిగూడెం మండలానికి చెందిన ఒక రోగిని ఏలూరులో దించి తిరిగి వెళ్తున్న క్రమంలో చీపురుగూడెం వద్ద రహదారి గోతులుగా ఉండటంతో అదుపుతప్పి కరెంట్ స్తంభాన్ని, అనంతరం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న సుభద్రపాలెం గ్రామానికి చెందిన యువకులు చవ్వాకుల పవన్, సమతల శివ గాయపడ్డారు. వెంటనే క్షతగ్రాత్రులను తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుత్‌కు రెండు రోజులు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి శివారు సంజీవపురంలో 11కేవీ నబీపేట ఫీడర్ ఆర్‌ఓయస్‌యస్ వర్క్‌లో భాగంగా కొత్త బ్రేకర్ నిర్మాణం చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆదివారం, సోమవారం రెండు రోజులు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. త్రీఫేజ్ సప్లయి ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు తిరిగి 12గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా చేయనున్నట్టు వివరించారు.

మధ్యంతర భృతి మంజూరు చేయాలి

దేవరపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పెన్షనర్లకు మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 13 లక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కుటుంబాలకు 2018 జూలై నుంచి ఇప్పటి వరకు చెల్లించవలసిన డీఏ, డీఆర్, 11వ పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వివిధ రకాల బకాయిలను సుమారు రూ.25 వేల కోట్లు ప్రభుత్వం చెల్లించవలసి ఉందన్నారు. బకాయిలను మొత్తం ఒకే దఫా చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లన్నీ ధర్మబద్ధమైనవేనని పెండింగ్‌లో ఉన్న ఇతర ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





